# "కోడి గ్రుడ్డా? ఆమ్లెటా?"

"ఆ కోడి గ్రుడ్డు కావాలా, ఆమ్లెటు కావాలా తేల్చుకోండి. ఆమ్లెటు కావాలంటే కోడి గ్రుడ్డును పగలకొట్టక తప్పదు. ఆస్తి అన్నది ప్రాథమిక హక్కుగా వున్నంతకాలం సామ్యవాదం రాజాలదు." అన్నారు శ్రీరంగం శ్రీనివాసరావు.

ఢిల్లీ తెలుగు సాహితీవారు ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ శ్రీశ్రీ విప్లవ రచయితల సంఘం గురించి సవివరంగా చెప్పారు.

"అభ్యుదయ రచయితల సంఘం మృతప్రాయం. అందుకనే విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించింది. ఖమ్మంలో ఇటీవల "విరసం సమావేశాలు అతి ఉత్సాహవంతంగా జరిగాయి. కాని మన పత్రికలు శాయశక్తులా ఈ ''రహస్యాన్ని" కాపాడుతున్నాయి. "విరసం" పుబ్బలో పుట్టి మఖలో మాడేదికాదు. ఇది నాలుగు కాలాలబాటు నిలిచేది. ఇదే నూటికి నూరుపాళ్ళు మార్క్సిస్టు సామ్యవాదం ఆశయంగా కలది." అన్నారు శ్రీశ్రీ.

"దిగంబర కవులు బూతులు వాడారని, తిట్లు ప్రయోగించారని విమర్శిస్తున్నారు. బూతు అన్నది-గిరీశం "వితంతువు" గురించి చెప్పినట్లు ఉన్నా దన్నవాడి మనసులోనే వుంది. ఎంకి పాటలు ఎంకిపాటల భాషలోనే బాగుంటాయి. అన్నిమాటలకూ నిఘంటువులో చోటుంది. దిగంబర కవులు తిడుతున్నారు. నిజమేకానీ ఎవరిని తిడుతున్నారు. తిట్టవలసిన వారినే తిడుతున్నారు. నవరసాల్లో భీభత్సం ఒకటి.

భీభత్సానికి స్థాయీభావం జుగుప్స జుగుప్సే దిగంబరకవుల ఆశయం. మీకు జుగుప్సకల్గింది అంటే వారిఆశయం నెరవేరినట్లే. భీభత్సం నవరసాల్లో ఒకటి అని అంగీకరించినంతకాలం దిగంబర కవులను కవులుగా అంగీకరించ వలసిందే అయితే నేడు దిగంబరకవులు. "తిరుగబడు'' కవులు-- వీరంతా కలిసి విప్లవ రచయితల సంఘంగా అయ్యారు. దేశం అన్ని మూలలా అశాంతి అలుముకునివుంది. అన్ని ప్రాంతాలలోను ఇలాటివే ఉద్యమాలు బయలుదేరుతున్నాయి. వీటి నన్నిటినీ ఒక్క వేదికమీదకు చేర్చగలగాలి. ఆ వేదికే విప్లవ రచయితల సంఘం.'

"కమ్యూనిస్టుపార్టీ ఇంతవరకూ "మానోకోటిలీడన్" (ఏకదళబీజం). ఇప్పుడది "డైకోటిలీడన్'' (ద్విదళబీజం) అయింది. ఆ చీలిక నుండి మొక్కపుడుతుంది. ఎన్నో శక్తుల ఫలితంగానే ఒక ఉద్యమం ఆవిర్భ విస్తుంది.

"దేశంలో అశాంతి తాండవమాడుతుంది, మాకలాన్ని ఆయుధంగా చేయాలని ఆశయం, ఆ కలంతో, ఆ ఆయుధంతో పోరాడాలని ఆశయం. కాని ఎవరి తరపున పోరాడాలి? కలవారి తరపునా లేనివారి తరపునా? అందుకనే ''కమిట్'' (బద్ధులు) కావాలి. ''లేనివారి భవిష్యత్తుకోసం కమిటీ కావాలి.''

''నేనుకూడా పాతకీర్తితో బ్రతికుతున్నానా అనిపిస్తుంటుంది. ''మహా ప్రస్థానం'' తర్వాత ఏమిరాశానో. అన్పిస్తుంటుంది. 'విశాఖపట్నం' అనే కావ్యం రాయాలని, దానిని విశాఖ ప్రాంతపు మాండలిక భాషలో రాయాలని గత 20సంవత్సరాలుగా ఉబలాటంవుంది, ఆ వుద్దేశం ఫలించే అవకాశం ఇపుడిపుడే కన్పిస్తుంది.'' అన్న శ్రీశ్రీ ''ఝుంఝు అన్న విప్లవ రచయితల సంఘం వారి కవితా సంకలనంలోని తమ కవిత ''నిన్నటి జట్కావాలా చదివారు.

నేనుమాత్రం సావను
సచ్చేదాక బతికే తీరతాను.

సావ్వలసి నోళ్ళని సంపేతీరతాను.'' అంటాడు. తన ఏకైక జీవనోపాధి అయిన గుర్రం చనిపోయినాక ఆ జట్కావాలా.

శ్రీశ్రీ తర్వాత ప్రసంగించిన జ్వాలాముఖిగారు సంఘజీవి అయిన రచయిత తనను పెంచుకోవడం కొరకు రాయాలా, నలుగురుకోసం రాయాలా అని తేల్చుకోవాలన్నారు. "నల్గురి తరఫున అనిబయలుదేరినపుడు పొరపాట్లకు అవకాశంవుంది. ఆ పొరపాట్లే దిగంబర కవితోద్యమం కొంతవరకు చేసింది. అందుకనె వాటిని దిద్దుకొన్నాము. విప్లవ రచయితల సంఘంలో కలిశాము అని చెప్పారాయన.

"భావనా స్వాతంత్ర్యం వలన ఎవరికి ప్రయోజనం? రంగుటద్దాలలో నుండి ఎన్నాళ్లు చూస్తాము జీవితాన్ని? ఎన్నాళ్లు రాస్తాము సువాసనల నవలలను? మే మేదో విప్లవాన్ని తెస్తామనికాదు. జరుగుతున్న చరిత్రను రికార్డు చేస్తాము నిజాన్ని చెబుతాము. సరైన దారి చూపుతాము. మార్క్సిజం శాస్త్రం మాత్రమేకాదు. శస్త్రం కూడా కావాలి. వియత్నాంలోని పోరాటాలకు జేజేలు చెబుతూ మనదేశంలోని పోరాటాల పట్ల ఈ నీళ్ళు మింగుడెందుకు? ఎర్రగులాబీ సమతా పరిమళాలులేవు. సంఖ్యపైన మాకు విశ్వాసం కావాలి. జానపదంలో రచనలు కావాలి. మాండలికాల్లో రచనలు కావాలి. వ్యావహారిక భాష రావాలి. సరళమైన భాషరావాలి. వ్యావహారిక భాష గనుక బోధనా భాష అయితే "సెక్యులరిజం" వస్తుంది. "సోషలిజం" వస్తుంది కనుకనే ప్రగతి నిరోధకులు దాన్ని అడ్డుతున్నారు. కనీసం ఈ వ్యవహారిక భాష నిమిత్తం అయినా మన మంతాకలిసి పోరాడలేమా? అని ప్రశ్నించారు శ్రీ జ్వాలాముఖి.

తమ ప్రసంగం చివర ఆయన 'ఝంఝ' సంకలనంనుండి "శివుడు" రచించిన "నరుడో! భాస్కరుడో!" అన్న గేయాన్ని, "ఆకాశం ఎర్రబడుతుంది'' అన్న స్వీయ రచనను అత్యద్భుతంగా చదివారు.

శ్రీశ్రీ. శ్రీజ్వాలాముఖి ప్రభృతులు హాజరయిన ఢిల్లీలోని ఆఫ్రో ఏషియన్ రచయితల సమావేశానికి హాజరయిన శ్రీ తుమ్మల వెంకట్రామయ్యగారు తర్వాత మాట్లాడుతూ "నయాగరా" కవులతో ప్రారంభమైన అభ్యుదయ సాహిత్యపు పూర్వాపరాలను వివరించారు.

"గాంధేయులలో అనేక రకాలవారున్నారు. మా ఊళ్ళో అసలు సిసలు గాంధేయులొక్కరు బ్రాందీ పరిశ్రమను పెడుతున్నారు. ఇదే విధంగా మార్క్సిస్టులలోనూ అనేక రకాలవారున్నారు."

"ఏ సిద్ధాంతమయినా క్షీణదశలో వికృతరూపాలు దాల్చుతుంది. మార్క్సిజం, మార్క్సిజం అంటున్నవారిని ఆచరణలో చూడాలి ఆ ప్రబోధించిన వారిలో మార్క్సిజం ఎంతమాత్రం వుందో చూడాలి" అన్నారు శ్రీ తుమ్మల.

ఆనాటి సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీ వేమూరి ఆంజనేయ శర్మగారు- "ఈనాడు తెలుగు సాహిత్య ప్రపంచంలో సంచలనం కల్గించిన ఈ ఉద్యమాల స్వరూపాలను స్పష్టంగా తెలుసుకోగల్గడం ఆనందదాయకం. ఏది నిలుస్తుంది, ఏది సార్థక మవుతుంది అన్నదానిని కాలము, ప్రజలు తేల్చుతారు. మిగతా భాషలలోని పరిస్థితినికూడా పరిశీలించాక- ఈ నవకవితోద్యమంలో మన తెలుగుభాష లన్నిటికీ నాయకత్వం వహిస్తున్నదని స్పష్టమయింది. ఇది గర్వకారణం" అన్నారు.

కనుక, ఆనాడు "టుబి ఆర్ నాట్ టుబి" అన్న సందిగ్ధంలో పడ్డాడు హామ్లెట్.

ఈనాడు బుద్ధిజీవులు తేల్చుకోవాలి కావలసింది గ్రుడ్డా, ఆమ్లెటా- అంటున్నారు శ్రీశ్రీ.

[11 డిసెం. 70]